# స్త్రీణాంచ చిత్తం పురుషస్య భాగ్యం

ఆనందరావు జాగ్రత్త పరుడు.

కార్యక్రమాన్ని నిర్ణయించుకోడంలో ఎంత జాగ్రత్తగా వుంటాడో, దాన్ని పాటించడంలో అతడు మరింత మెలకువగా వుంటాడు. అందుకు నిదర్శనం అతడు టంచనుగా గడియారంలో పదకొండు గంటలు కొట్టేసరికి స్టేషనులో వుండడమే!

పన్నెండు గంటలకు వచ్చే రైలుకోసం పదకొండుకే స్టేషను కెందుకు వెళ్ళాలి అని ఎవరైనా ప్రశ్నిస్తారేమోనని ఆనందరావు ఆ ప్రశ్నకు సమాధానం ముందుగానే ఆలోచించుకున్నాడు. 'వానరావడం, ప్రాణం పోవడం ఎలా మానవుడి అధీనంలో లేవో, రైళ్ళ రాకపోకలు గూడా అలా మానవుడి నిర్ణయాలకు కట్టుబడి వుండవు. ఒక్కొక్కప్పుడుఒక్కొక్క రైలు రెండు.మూడు గంటలు ఆలస్యంగా గూడా వస్తుంది. అలాంటప్పుడు ఒకరైలు, ఒక రోజున ఒకగంట ముందుగా రాదని మాత్రం పూచీ ఏమిటి?'

స్టేషనులో అడుగుపెట్టీ పెట్టక మునుపే ఆనందరావు చేయి జేబులోకి పోయింది. వెంటనే భర్తీగా వున్న పర్సుపైకి వచ్చింది. అతడు బుకింగ్‌రూము కిటికీ దగ్గర నిలబడి, ఒక అయిదు రూపాయల నోటు లోపలికి చాపి "నెల్లూరు, ఒక టికెట్ సార్!" అన్నాడు.

నెల్లూరికి టికెట్టు ఇవ్వమని అడగడంలో ఆనందరావు కనబరిచిన వినయాన్ని అవగతం చేసుకుని, అతనికా టికెట్టును ప్రసాదించవలసిన బుకింగుక్లర్కు తారకరావు అప్పుడు తన స్వాధీనంలో లేడు. కుర్చీలో కూచ్చుని, టేబిల్ పైకి కాళ్లు చాపుకుని, చేతుల్లో దినపత్రికవుంచుకుని అతడు రాజకీయ వార్తల్లో మునిగి పోయి వున్నాడు.

ఆనందరావుకు దిన పత్రికలంటే బొత్తిగా పరిపడదు. అదేపనిగా వాటిని చదువుకుంటూ చునే వాళ్ళని చూస్తే అతనికి తగని చిరాకు. నీ తన అగ్రహాన్ని ఎక్కడ చూపించచ్చునో, ఎక్కడ చూపించరాదో బాగా తెలిన ఆనందరావు, మళ్ళీ వీలయినంత వినయంనే టికెట్టుకోసం అర్థించాడు. అయితే, తడోసారి బిగ్గరగా "టిక్కెట్టుసార్ టికెట్టు, ల్లూరికి!" అంటూ అరిచిన మాట మాత్రం స్తవం!

తారకరావు చేతుల్లో నుంచీ పేపరు క్రిందికి రిపోయింది. అతడు ఆనందరావు వైపు శాడు. కానీ అవేం చూపులు! తన ధ్యాన ష్టను భగ్నంచేసిన మేనకను విశ్వామిత్రుడలా హపి వుంటాడు!

తనపైకి ప్రసరిస్తున్న తారకరావు కోప క్షణాలకు కారణమేమిటో తెలుసుకునేందుకు నందరావు ప్రయత్నించలేదు. అతడు తన మామూలు ధోరణిలోనే "టికెట్టు సార్, నెల్లూకి" అన్నాడు. డబ్బిచ్చి టికెట్టు తీసుకోవడం పయాణికుడి హక్కనీ, మారు మాటాడకుండా న్ని యివ్వడం బుకింగ్ క్లర్కు బాధ్యతనీ నందరావు అభిప్రాయం!

అయితే బుకింగు క్లర్కు తారకరావు బాధ్య ను గుర్తించి, అందుకు తగ్గట్టుగా ప్రవర్తించే మంచి ఉద్యోగి'లా కనిపించలేదు ఆనంద రావుకు!

"టికెట్లు యిప్పుడు యివ్వబడవు" అని క్తసరిగా ప్రకటన జారీచేసి, తారకరావు ళ్ళీ పేపరు చేతికి తీసుకున్నాడు.

"ఏం? ఏందుకివ్వబడవు?" అని గద్దిం డు ఆనందరావు, తనకేవో అవమానం జరిగి యినట్టు భావించుకుని! అయితే ఆనందరావు ంతసేపు వేచివున్నా యీ ప్రశ్నకు తారకరావు గ్గరినుంచి సమాధానం రాలేదు.

ఆనందరావుకు కోపం సాధారణంగా రాదు నీ వస్తే మాత్రం చొక్కా చేతులు పైకి మడిచి, ఎదుటి వాడితో కుస్తీకి తలపడడం అతనికి పుట్టుకతో వచ్చిన గుణం! అయినా కుస్తీ పట్టడానికి అభ్యంతరంగా తనకూ, తారకరావుకూ మధ్య ఒక రాతి గోడ అడ్డంగా వుండడంవల్ల అతడు కాస్త తమాయించుకుని "ఇక్కడతమరు చేయవలసిన ఉద్యోగం పేపరు చదువుకోవడం కాదని నా అభిప్రాయం.అయితే మీ ఉద్యోగం పట్ల మీ ఉద్దేశమేమిటో నాకు తెలియదు. ఇక్కడ 'రైళ్లు బయలుదేరడానికి రెండుగంటలు ముందు నుంచి టిక్కెట్లు ఇవ్వబడును' అని బోర్డు వ్రేలాడుతోంది. ఇది మరీ అంతచిన్న బోర్డు కూడా కాదు. కళ్ళకు కనబడక పోవడానికి!....మరి....మరి..." అంటూ అర్ధోక్తిలో ఆగిపోయాడు.

"అక్కడ ఆ బోర్డు వ్రేలాడుతూనే వుంటుంది. ఇక్కడ మేము మా ఇష్టం వచ్చినప్పుడే టికెట్లు యిస్తూ వుంటాము" అన్నాడు తారకరావు - పేపరు చూచుకుంటూనే!

ఆనందరావు తోక త్రొక్కిన త్రాచులా మండిపడుతూ, కంప్లెయింట్స్ పుస్తకం కోసం స్టేషన్‌మాస్టర్ గది దగ్గరకు పరుగెత్తి, ఆ గది తలుపులు మూయబడి వుండడం చూచి బిక్కమొగం వేసుకుని కాలుగాలిన పిల్లిలా వెయిటింగ్ రూంలో తచ్చాడ సాగాడు.

తరువాత అరగంటకు రైలు అవుటయినందుకు గుర్తుగా గంటమ్రోగింది. ప్రయాణీకులు ఒక్కొక్కరుగా టిక్కెట్టు తీసుకోసాగారు. ఆనందరావు, మళ్ళీ బుకింగ్ రూము కిటికీ దగ్గర నిలబడి తారకరావు ముఖాన్ని చూడ్డానికి మనస్కరించక డబ్బిచ్చి ఒక పెద్దమనిషిచేత టికెట్టు తెప్పించుకున్నాడు.

* * *

ఐదు రోజుల తరువాత సంగతి.

ఆనందరావు ఆనాటి ఉదయమే అత్తగారి వూరినుంచీ తిరిగి వచ్చి ఆఫీసులో కూచుని ఏవో అకౌంట్సు చూచుకుంటూ వుండగా కిటికీ దగ్గర నుంచీ ఎవరో పిలిచారు. స్టాంపులకోసం ఎవరో వచ్చి వుంటారనుకుంటూ ఆనందరావు తలెత్తి చూచాడు. అక్కడ టికెట్టు ఇవ్వకుండా రైలు ప్రయాణీకుల్ని ఏడిపించే తారకరావు నిలబడి వున్నాడు!

గడచిన నాలుగైదు రోజులనుంచీ, అధికారమే గనుక తన చేతిలో వుంటే తారకరావుకు ఏయేశిక్షలు విధించవచ్చునో ఆలోచించు

మధురాంతకం రాజారాం



కున్న ఆనందరావు ఈసారి ఉడికిం ంతు తన దనుకుంటూ "ఎవరక్కడ? ఏం కావాలి?" అని ధీమ ా ప్రశ్నించాడు.

"ఆc, ఏంలేదు సార్! నాక జాబు వచ్చివుండాలి గుంటూరు నుంచీ! కొంచెం దయచేసి దాన్ని. ." అంటూ నసిగాడు తారకరావు.

"గుంటూరు నుంచీ జాబా!' అంటూ ఆనందరావు పైకిలేచి "ఇప్పుడు టైమెంత? తొమ్మిదిన్నరయింది. పోస్టుమేన్ ఊళ్ళో ఎక్కడో జాబులు బట్వాడాచేస్తూ వుంటాడు. వెళ్ళి అతన్ని వెదికి పట్టుకోండి...." అన్నాడు.

"ఇక్కడికే స్టేషనుకు రెండుమైళ్ళుదూరం కదండీ! పోస్టుమేన్ ఊళ్ళో తన పనంతా పూర్తయిన తర్వాతగానీ అటువైపు రాడు. ఇప్పుడు స్టేషను జాబులన్నీ ఆఫీసులోనే వుంటాయి. మరినేను ఎదురు చూస్తున్న జాబుతో నాకు చాలా తొందర పనుంది. శ్రమ అనుకోకుండా మీరు దయచేసి...."

"శ్రమ అని మా కర్తవ్యాన్ని నిర్వహించకుండా ఊరుకునే అలవాటు మాకులేదండీ! అయితే తమకు జాబులు వెదికి ఇవ్వవలసిన కర్తవ్యం మాదిగాదు. మీరు పోస్టుమేన్ వచ్చేవరకూ ఆగడం మంచిది...." అని ఆనందరావు మళ్ళీ తన పనిలో లీనమైపోయాడు.

తారకరావు అయిదు నిమిషాలవరకు విగ్రహంలా కిటికీ దగ్గరే నిలబడివుండి, యికలాభంలేదనుకుని మెల్లగా అక్కడి నుంచీ వెళ్ళిపోయాడు.

"టిట్ ఫర్ టాట్! సరైన శాస్తి చేశాన్లే" అని సంతృప్తి చెందాడు ఆనందరావు.

* * *

పదిరోజుల తర్వాత ఒకనాడు ఆనందరావుకు రైల్వే

స్టేషనుకు వెళ్ళి రావలసిన పని తగిలింది. సాయంకాలం నాలుగున్నర గంటల బండికి నెల్లూరునుంచీ శ్రీమతిగారు రాబోతున్నదన్న శుభవార్త అతనికా రోజు ఉదయమే అందింది. వార్త అందినప్పటినుంచీ వాయువీధుల్లో సంచరింప సాగిన ఆనందరావుకు స్టేషనులో అడుగు పెట్టేంతవరకు తారకరావు జ్ఞప్తికే రాలేదు.

స్వతహాగా ఆనందరావుది కలహ స్వభావం గాదు. మంచికో చెడ్డకో ప్రారంభమైన వైమనస్యం అంతటితో ఆగిపోతే బాగుండు ననుకున్నాడతడు. అయితే పూర్వవైరం మరింత ఉద్ధృతం అయినట్టు తారకరావు ఆనందరావు పైన తీక్ష్ణ వీక్షణాలు ప్రసరింపసాగాడు.

ఎందుకైనా మంచిదని ఆనందరావు ఒక ప్లాట్‌ఫారం టికెట్టు కొనుక్కుని బ్రిడ్జి దగ్గరకు వెళ్ళి రైలుకోసం ఎదురు తెన్నులుచూడసాగాడు. నాలుగున్నరకు సరిగ్గా రైలు వచ్చి స్టేషనులో ఆగింది. పెట్టెలోనుంచీ దరహాస వదనంతో వాసంతి ప్లాట్ ఫారంపైన కాలు పెట్టింది. ఆమెగారు తనవెంట దెచ్చుకున్న లగేజీనంతా జాగ్రత్తగా క్రిందికిదింపి, ఆనందరావు "టికెట్టుఎక్కడుంచుకున్నావు వాసంతీ?" అని భార్యను పలకరించుకున్నాడు.

'టికెట్టు' అన్నమాట చెవిని బడగానే వాసంతి ముఖంలో వెలుగు కాస్తా మాయమైపోయింది. ఆమె చేతవున్న పుస్తకాన్ని విదిలించి చూచుకుంది. తొందరగా పెట్టె తెరిచి చీరల మడతలన్నీ గాలించింది. లెదర్‌బ్యాగు తెరిచి అందులోని పుస్తకాలన్నింటిని ప్లాట్ ఫారంపైన కుమ్మరించింది. కానీ టికెట్టు మాత్రం ఎక్కడా కనిపించలేదు!

టికెట్టు కోసం వాసంతి అన్వేషణ కొనసాగుతూ వుండగానే "టికెట్,టికెట్" అంటూ తారకరావు అక్కడికి వచ్చేశాడు.

ఆనందరావు అధోముఖుడై "టిక్కెట్టు లేదు. ఎక్కడో జారిపోయింది" అన్నాడు.

"జారిపోయిందని మాకు నమ్మకం ఏమిటి? మీరు టికెట్టు లేకనే ప్రయాణంచేసివుండొచ్చు" అన్నాడు తారకరావు.

"ఇంతకూ మీరనేదేమిటి?" అన్నాడు ఆనందరావు. శిక్షను ధైర్యంగా ఎదుర్కొడానికి సంసిద్ధుడైన నేరస్తుడిలా.

ఇన్‌స్పెక్టర్ జావర్‌లా సీరియస్‌గా ముఖం పెట్టి "పెనాల్టీ చెల్లించాలి. ఎక్కడినుంచి వస్తున్నారు?" అని ప్రశ్నిస్తూ తారకరావు రసీదు పుస్తకం చేతికి తీసుకున్నాడు.

"నెల్లూరినుంచి" అంటూ ఆనందరావు జేబులో చేయివేశాడు.

తారకరావు కాగితం పైన ఏదో లెక్కవేసి "ఇరవైయేడు రూపాయలా యాభై అయిదు పైసలు" అన్నాడు.

ఆనందరావు ముఖం వెలవెలపోయింది. అతడి జేబులో అంతడబ్బు లేదు. అయినా అతడు తారకరావును బ్రతిమాలు కోవాలనుకోలేదు.

"నువ్విక్కడే ఆ వరండాలో కూచో వాసంతి! నే నిప్పుడే వస్తాను ఊళ్లోకి వెళ్ళి" అని భార్యతో చెప్పి, అతడు తారకరావంటూ ఒక వ్యక్తి అక్కడున్న విషయాన్ని మరిచిపోయినట్టు తిన్నగా ఊళ్లోకి దారితీశాడు.

ఆనందరావు స్టేషనుకు తిరిగి వచ్చేసరికి గంట అయిదున్నర దాటింది. అతడు సరాసరి బుకింగురూములోకి వెళ్ళి డబ్బును టేబిలు పైన కుప్పబోసి "రసీదు యివ్వండి" అన్నాడు.

"మన్నించాలి ఆనందరావుగారూ మీకు శ్రమ కలిగించినందుకు! మీరు వెళ్ళిపోయిన తర్వాత టికెట్టు దొరికింది" అన్నాడు తారకరావు నింపాదిగా!

ఆనందరావు డబ్బు చేతికి తీసుకుని వెనుదిరిగి వెళ్ళిపోబోతుండగా తారకరావే ప్రారంభించాడు. "ఆనందరావుగారూ! ఇప్పటికే ఊళ్లోకి స్టేషనుకు తిరిగి అలిసిపోయారు. ఈ రాత్రికి మీరు మా ఇంట్లో ఆతిథ్యం పుచ్చుకోరాదదూ, దయచేసి?"

ఆనందరావుకు ఒళ్లు చరాలుమంది. అతడు "థేంక్స్. మీ ఆహ్వానాన్ని నిరాకరించవలసివచ్చినందుకు చింతిస్తున్నాను. సెలవు." అంటూ బయటికి వచ్చి వాసంతికోసం ప్లాట్‌ఫారమంతా కలయజూశాడు. ఒకటి రెండుసార్లు ఈ చివరనుంచీ ఆ చివరకు తిరిగాడు. వెయిటింగు రూములో కూడా చూచాడు. వాసంతి లేదు? ఏమైపోయింది?

ఇంతలో తారకరావు బుకింగు రూమునుంచీ బయటికి వచ్చి "ఆనందరావుగారూ! మీ ఆవిడ మీకోసం వెదుకుతున్నట్లున్నారు. అగో, ఆమెది యింట్లోకి వెళ్ళడం మాత్రం చూచాను. వెళ్ళి కనుక్కోండి" అన్నాడు.

ఆనందరావు మళ్ళీ ఒక 'థేంక్స్' ను తారకరావు ముఖాన విసిరికొట్టి, రైల్వే క్వార్టర్స్‌లో అతడు చూపించిన యింటిముందరికి వెళ్ళి నిలబడ్డాడు. ఇంట్లో నుంచే నవ్వులు మాటలు. చప్పట్లు జోరుగా వినిపిస్తున్నాయి. 'గొప్ప రాచకార్యమే వెలిగిస్తున్నావులే' అని మనసు లోతుల్లో రుసరుసలాడిపోతూ ఆనందరావు 'వాసంతీ!వాసంతీ!' అని భార్యనుపిలిచాడు.

"అక్కడే నిలబడి పోయారెందుకూ! లోపలికిరండి" అంటూ వాసంతి బయటికి వచ్చి "మీరు దీన్నెరుగరు గదండీ! ఇదే మా సత్యవతి" అంటూ తననేస్తాన్ని ఆనందరావుకు పరిచయం చేసింది.

ఆనందరావు వసారాలోవున్న కుర్చీలో కూలబడుతూ "మీ వారిక్కడ ఏం చేస్తున్నారండీ?" అన్నాడు.

"మీకు తెలియదేమండీ? మావారిక్కడ బుకింగు క్లర్కుగా వుంటున్నారు" అంది సత్యవతి.

'హతోస్మి, హతోస్మి!' అనుకున్నాడు ఆనందరావు.

"ఈ రాత్రి కిక్కడే వుండిపోవాలని బలవంతం చేస్తోందండీ సత్యవతి" అని, ఆనందరావు అభిప్రాయం కోసం ఎదురుచూడకుండా "లేకలేక మూడేళ్ళకు కలుసుకున్నాం. మనకు దానిచేతుల మీదుగా విందు పెట్టాలని వుందటండీ" అంది వాసంతి.

ఈసారి ఆతిథ్యాన్ని నిరాకరించే సాహసం ఎంత ప్రయత్నించినా ఆనందరావుకు లేకపోయింది.

ఆ రాత్రిపూట రైల్వే క్వార్టర్సులో పోస్టల్ క్లర్కు ఆనందరావు, రైల్వేబుకింగు క్లర్కు తారకరావు ప్రక్కన కూర్చుని విస్తరిలోని పిండివంటల్ని మాయంచేస్తూ సత్యవతమ్మ చేతి పాకాన్ని నలపాకమనీ, భీమపాకమనీ మనస్ఫూర్తిగా మెచ్చుకున్నాడు.

